# డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ దశవార్షికోత్సవ సమావేశాల సమీక్ష

డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గత శని, ఆదివారాల్లో (సెప్టెంబరు 20, 21) నిర్వహించిన తెలుగు సాహితీ సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. నిర్వాహకులు ఊహించినదానికంటే ఎక్కువగా సాహిత్యాభిమానులు సమావేశాలకు అమెరికా నలుమూలలనుండి, కెనడా, జర్మనీ, భారతదేశాల నుండి రావడంతో ఎంతో ఉత్సాహవంతమైన వాతావరణం నెలకొంది. శనివారం సభ ప్రారంభ సమయానికే సుమారు 150 మంది వరకు సాహిత్యాభిలాషులు సమావేశమయ్యారు. నిష్పాక్షికమైన సాహిత్య విమర్శకు తెలుగు సాహిత్యంలో ఉన్న స్థానం, దాని ఆవశ్యకత ప్రధాన వస్తువుగా ఏర్పరచిన ఈ సమావేశాలు, సభానిర్వాహకులు మద్దిపాటి కృష్ణారావు స్వాగతంతో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆపైన విస్కాన్సిన్ విశ్వవిద్యాలయ ఆచార్యులు వెల్చేరు నారాయణరావు ముఖ్యోపన్యాసం ఆద్యంతమూ ఆలోచన రేకెత్తించేదిగా సాగింది. వాదాలకు దూరంగా, విమర్శ దృష్టి ప్రధానంగా సాహిత్యంపై ఉండాలనీ, అప్పుడే తెలుగు సాహిత్యానికి ప్రపంచంలో గుర్తింపు సాధ్యమని నారాయణరావు గారు వివరించారు. మధ్యాహ్నం వచన సాహిత్యంపై జరిగిన సమావేశంలో ప్రముఖ నవలా, కథా రచయిత్రి చంద్రలత ముఖ్య అతిథిగా తెలుగు నవల పూర్వాపరాలను చర్చిస్తూ ప్రసంగించారు. ఇదే సమావేశంలో కొడవళ్ళ హనుమంతరావు గారు వడ్డెర చండీదాస్ నవల అనుక్షణికం లో గాయత్రి పాత్రను విశ్లేషిస్తే, కారుమంచి శ్రియ, ఓల్గా రాసిన రాజకీయ కథల్లోని స్త్రీవాద భావజాలాన్ని అమెరికాలో పుట్టి పెరిగిన యువతిగా తన స్వానుభవంతో విస్లేషించారు. ఆరి సీతారామయ్య గారు మంచి కథకు ఉండవలసిన లక్షణాల్ని, రచయిత తనకథల్లోని లోపాల్ని సవరించుకోవడానికి చెయ్యవలసిన కృషిని చర్చించారు.రెండవ సమావేశంలో తెలుగు కవిత్వంపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి కన్నెగంటి చంద్ర నిర్వాహకులుగా వ్యవహరించగా, వెంకటయోగి నారాయణస్వామి, విన్నకోట రవిశంకర్, తమ్మినేని యదుకులభూషణ్, వేలూరి వెంకటేశ్వరరావు గార్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలుగు కవిత్వంలో ఊహలు, అపోహలు, ప్రేరణ, నాగరికత, పాఠకుల స్పందనలపై విస్తృతమైన చర్చ జరిగింది.

సాయంత్రం జరిగిన విందు, వినోద కార్యక్రమాల్లో, కొందరు కవులు, రచయితలు తమ స్వీయ రచనలు వినిపించారు. అమెరికాలో పుట్టి పెరిగిన చిరంజీవి అల్లూరి స్పందన తన కుటుంబ సభ్యులు కేంద్రంగా అల్లి చదివిన కవిత అందరినీ ఆకర్షించింది. డిట్రాయిట్ తెలుగు యువత జానపద నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి ప్రచురణలు అమెరికా తెలుగు కథానిక, అమెరికామెడి నాటికలు ఆవిష్కరించారు. అలాగే, డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ వారు ఈ దశవార్షికోత్సవ సమావేశాల సందర్భంగా ప్రచురించిన, వాసిరెడ్డి నవీన్ సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణా విముక్తిపోరాట కథల సంకలనాన్ని గుళ్ళపల్లి రవి ఆవిష్కరించారు.. తన అనువాదాల ద్వారా తెలుగు సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్న వెల్చేరు నారాయణరావు, తన రచనల ద్వారా తెలుగు నవలకు తిరిగి జీవం పోసిన చంద్రలత, డిట్రాయిట్ లోను, ఆంధ్రప్రదేశ్ లోను తెలుగు సాహిత్యానికీ, ఇతర కళలకూ, ఇతోధికంగా ప్రోత్సాహాన్నిస్తున్న వడ్లమూడి బాబు రాజేంద్రప్రసాద్, కంప్యూటర్లపై తెలుగు వ్రాయడానికి మొదటి సారిగా ఒక ప్రమాణాన్ని రూపొందించిన కన్నెగంటి రామారావు గార్లని, డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ విశిష్ఠ సేవా పురస్కారాలతో సత్కరించారు.

రెండవరోజు ఉదయం కన్నెగంటి రామారావు నిర్వాహకులుగా తెలుగులో ప్రచురణలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ ప్రచురణలపై కొలిచాల సురేశ్, అమెరికాలో పుస్తకాల పంపిణీపై వంగూరి చిట్టెన్ రాజు, పాత పుస్తకాలను డిజిటైజ్ చెయ్యడంలోని సమస్యల గురించి పారినంది లక్ష్మీనరసింహం (పాలన), పుస్తకాన్ని ప్రచురించడానికి, అచ్చువేయడానికి ఉన్న తేడాను వివరిస్తూ వెల్చేరు నారాయణరావు గార్లు ప్రసంగించారు. పుస్తక ప్రచురణలో సాంకేతికంగా వస్తున్న మార్పులపైనా, పంపిణీపైనా, పరిష్కరణ లేమి మొదలైన అంశాలపై విస్తృతమైన చర్చ జరిగింది. ఆదివారం మధ్యాహ్నం జరిగిన నాల్గవ సమావేశంలో ముందుగా తెలుగు సినిమా సాహిత్య చరిత్ర గురించి జర్మనీ నుంచి వచ్చిన పరుచూరి శ్రీనివాస్ చర్చించారు. సినిమా సాహిత్యమూ చరిత్రలపై జరుగుతున్న పరిశోధనల్లో కొట్టవచ్చినట్లు కనిపించే వాసి లేమి గురించి చాలా చర్చ జరిగింది. తరువాత తెలుగులో వస్తున్న బ్లాగులపై చర్చ జరిగింది. ఈ చర్చకు శంకగిరి నారాయణస్వామి (నాసి) నిర్వాకులుగా వ్యవహరించారు. బ్లాగుల్లోని తెలుగు సాహిత్యంపై చర్చ జరగాలన్నది అసలు ఉద్దేశంగా అనిపించినా, చర్చకు బదులు బ్లాగుల్ని పరిచయం చెయ్యడం, అసలు బ్లాగులు ఎలా చేస్తారో వివరించడంతో సరిపోయింది. వైజాసత్య రవి తెలుగు వికీపీడియాను పరిచయం చేస్తే, బసాబత్తిన శ్రీనివాసులు, చీమకుర్తి భాస్కరరావు, నాగం శరత్ గార్లు బ్లాగుల్ని పరిచయం చేశారు. ప్రవాసాంధ్రులు ఎలక్ట్రానిక్ మీడియాలోనే తెలుగును ఎక్కువగా వాడుతుండడంతో ఈ చర్చ ఆసక్తికరంగా జరిగింది. చివరిగా, విశ్వవిద్యాలయాల్లో తెలుగు బోధన, పరిశోధన పై జరపదల్చుకున్న చర్చను సమయం లేకపోవడం వల్ల కుదించి, తెలుగును విదేశీ భాషగా అమెరికాలోని పాఠశాలల్లో ప్రవేశ పెట్టడం గురించి అరుణ పాణిని గారి ఉపన్యాసంతో సమావేశం ముగిసింది. అమెరికాలో పాఠశాల విద్యార్థులంతా ఒక విదేశీ భాష నేర్చుకుని తీరాలి. అది ఏ భాషైనా కావచ్చు. అది తెలుగే ఎందుకు కాకూడదన్నది అరుణ గారి ప్రశ్న. దీనికి ఒక ప్రణాళికను కూడా సూచన ప్రాయంగా అరుణ గారు ప్రతిపాదించారు. సమావేశ నిర్వాహకులు మద్దిపాటి కృష్ణారావు గారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఈ రెండురోజులూ సభలు కేవలం కొద్ది నిమిషాల కంటే ఎక్కువ ఆలస్యం కాకుండా నిర్వహించి, సమయాభావానికి చోటు లేకుండా నిర్వాహకులు చూసుకున్నారు. సమావేశాలు చాలా ఆసక్తికరంగానూ, క్రమపద్ధతిలోనూ జరిగాయి. ఇది అభినందనీయం. వచ్చే సంవత్సరం కొడవటిగంటి కుటుంబరావు, త్రిపురనేని గోపీచంద్, శ్రీశ్రీ శతజయంతిల మేళవింపుగా ఇంకో సమావేశం జరపాలని ప్రతిపాదించబడింది. ఒక పండుగ వాతావరణంలో తెలుగు సాహిత్యం పై చర్చలూ, పాత మిత్రుల్ని కలవడం, కొత్త స్నేహితుల్ని పొందడం జరిగాయనీ ఆనందంతో అన్ని ప్రాంతాల నుండి వచ్చిన తెలుగు సాహిత్యాభిమానులు ఎన్నో మంచి జ్ఞాపకాల్ని తమవెంట తీసికెళ్తున్నామని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రచ్చబండ వంటి ఎలక్ట్రానిక్ సమూహాల్లో చర్చించుకున్న చాలా మంది తెలుగు సాహిత్యాభిమానులు ముఖాముఖీ కలుసుకోవడం ఇదే మొదటిసారి కావడంతో ఎంతో ఉత్తేజమైన వాతావరణంలో ఈ సమావేశాలు నడిచాయి. ఈ సమావేశాల్లో ఇచ్చిన ఉపన్యాసాలు, చర్చలతో సహా ఒక జ్ఞాపిక సంచికను సంవత్సరాంతంలోగా ప్రచురిస్తామని మద్దిపాటి కృష్ణారావు గారు తెలిపారు.